క్లుప్తంగా

పరిసరాల శుభ్రతపై అవగాహన

చిట్టమూరు : ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈవో పీఆర్డీ జనార్దన్ తెలిపారు. ఆయన సోమవారం ఎల్లసిరి గ్రామంలో తడి, పొడి చెత్తపై క్లాప్ మిత్రలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సేకరించిన చెత్తను అక్కడే తడి, పొడి చెత్తగా వేరుచేసి బండ్ల ద్వారా చెత్త సేకరణ కేంద్రానికి తరలించాలని సూచించారు. అక్కడ వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడల్లో ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 28 నుంచి మూడు రోజులు జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కబడ్డీ జట్టు ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. అలాగే టేబుల్ టెన్నిస్ పురుషుల విభాగంలో పి.చందు ప్రథమ, మహిళల విభాగంలో ఎస్.చందన ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వారిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి



సైదాపురం: మండలంలోని ఊటుకూరు సమీపంలో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి ఇచ్చిన భూములను పేదలకు పంపిణీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డిపి పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఊటుకూరు దళితవాడకు చెందిన నిరుపేదలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఊటుకూరు గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 3, 20, 25–1, తురిమెర్లలో 460, 461లో 178 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. మైనింగ్ లీజు గడువు 2023 ఆగస్టు 15న ముగిసిందన్నారు. ఆ భూములను పేదలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, వెంకటయ్య, మమత, కోటయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.


ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చు

చిల్లకూరు : క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి మందులు వాడితే నియంత్రించవచ్చని తిరుపతి స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి తెలిపారు. చింతవరం పీహెచ్‌సీ పరిధిలోని బల్లవోలు, తూర్పుకనుపూరులో సోమవారం స్విమ్స్ పిక్ బస్సు ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువ మంది చెడు వ్యసనాలకు అలవాటు పడి క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. తల్లులు బిడ్డలకు పాలు పట్టికపోవడం వల్ల అవి గడ్డలు కట్టి క్యాన్సర్‌గా మారే అవకాశం ఉందన్నారు. ఎదపై గడ్డలు ఉన్నట్లు అనిపిస్తే వైద్యులకు చూపించుకోవాలన్నారు. మంగళవారం చేడిమాల సచివాలయం పరిధిలో, 6న తిక్కవరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామని వెల్లడించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నాయుడుపేట టౌన్ : గర్భిణులు, బాలింతలు డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిణి సంధ్య తెలిపారు. ఆమె సోమవారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలు పుట్టిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మీజూరు చంద్రకళ, నర్సులు పాల్గొన్నారు.

టీబీ రహిత పంచాయతీగా వేపినాపి



పత్రాలు చూపుతున్న అధికారులు

రాపూరు: మండలంలోని వేపినాపి టీబీ రహిత పంచాయతీగా ఎంపికైనట్లు పీహెచ్‌సీ వైద్యులు ప్రమీలారాజకుమారి తెలిపారు. ఆమె సోమవారం వేపినాపి సచివాలయంలో వైద్య, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ వేపినాపి పంచాయతీగా టీబీ రహితంగా ఎంపికైనట్లు జిల్లా టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ నరసింహులు, శ్రీనివాసులు పత్రాలు అందజేసినట్లు తెలిపారు. నజీమున్నీసా, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఏఎన్ఎం భార్గవి పాల్గొన్నారు.

'కార్మికులను మోసం చేస్తున్నారు'

నాయుడుపేట టౌన్ : పెళ్లకూరు మండలం పునబాకలోని వైష్ణవి డెయిరీని మూసివేసి తమకు బకాయిలతోపాటు బోనస్, గ్రాట్యుటీ తదితరాలు చెల్లించకుండా యాజమాన్యం మోసం చేసిందని కార్మికులు ఆరోపించారు. వారు సోమవారం సీఐ సంగమేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

బయ్యావారి కండిగ్ర వద్ద నాసిరకంగా వేసిన తారు రోడ్డు



నాశిరకంగా వేసిన తారు రోడ్డుపై ఏర్పడిన గుంత



నెలరోజులకే గుంతలు


అధికార మదంతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర నిధులతో చేసిన రోడ్డు పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. నెల రోజుల్లోనే గుంతలు పడ్డాయి. అధికారులు భారీగా ముడుపులు తీసుకుని చూసీచూడనట్టు వ్యవహరించి బిల్లులు మంజూరు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- రోడ్ల పనుల్లో లోపించిన నాణ్యత
- ముడుపులు ముట్టడంతో మిన్నకుండిపోయిన పట్టించుకోని అధికారులు

చిట్టమూరు : మండలంలోని బయ్యావారికండ్రిగ రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం గ్రామీణ సడక్ యోజన కథనం కింద రూ.5.35 కోట్లు మంజూరుచేసింది. ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచింది. ఎన్నికలు రావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది జూలైలో స్థానిక ప్రజాప్రతినిధి చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. మొత్తం 7.70 కిలోమీటర్ల మేర రోడ్డు వేయాలి. అందులో 6.5 కిలోమీటర్ల వరకు తారు రోడ్డు వేశారు. మధ్యలో రెండు కల్వర్టులు నిర్మించారు. కూటమి నేతలు భారీగా గుడ్ విల్ డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ నిబంధనలకు నీళ్లు వదిలేశారు. నాణ్యతకు దిలోదకాలు ఇచ్చారు. గత నెలలో పనులు పూర్తయ్యాయి. నెల రోజులకే పలుచోట్ల తారు లేసి పోయి పెద్ద గుంతలు పడ్డాయి. అటువైపు వెళ్లే వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. కల్వర్టులపై ఒక లేయర్ సిమెంట్ రోడ్డు వేసి వదిలేశారు. ఏదైనా భారీ వాహనం వెళితే గతంలో వేసిన పైపులు పగిలిపోయి రోడ్డు మధ్యలో కుంగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు భారీగా ముడుపులు తీసుకుని చూసీచూడనట్టు బిల్లులు మంజూరు చేశారని మూడు గ్రామల ప్రజలు ఆరోపిస్తున్నారు.



వేసిన కొద్ది రోజులకే చీలిన సిమెంట్ రోడ్డు



సిమెంట్‌తో మెరుగులు దిద్దిన పాత కల్వర్టు

ఇష్టం వచ్చినట్లు చేశారు



బయ్యావారి కండ్రిగ, ఆలేటిపాడు మీదుగా వేసిన రోడ్డులో నాణ్యత పాటించలేదు. ఇష్టం వచ్చినట్లు పనులు చేపట్టారు. రోడ్డు పనులు పూర్తయి నెల రోజులకే గుంతలు పడ్డాయి. అధికారులు ముడుపులు తీసుకుని బిల్లులు మంజూరుచేశారు. ఇలా అయితే ఈ రోడ్డు ఎన్ని రోజులు ఉంటుంది.

- పులి వెంకటేశ్వర్లు, బయ్యావారికండ్రిగ, చిట్టమూరు

పది రోజులు కూడా క్యూరింగ్ చేయలేదు



బయ్యావారికండ్రిగ గ్రామంలో సీసీ రోడ్డు పనులు నాశిరకంగా చేపట్టారు. కనీసం పది రోజులు కూడా నీరు పోయలేదు. అప్పుడే రోడ్డుపై పలు ప్రాంతాలలో పగుళ్లు ఏర్పడ్డాయి. పెద్ద వాహనాలు వెళితే పగిలిన చోట మరింత లేచిపోయే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు పట్టించుకోలేదు.

- పి.చెన్నయ్య, బయ్యావారికండిగ్ర, చిట్టమూరు

పర్యవేక్షించాల్సింది కాంట్రాక్టు సంస్థే



గ్రామీణ సడక్ యోజన పథకం కింద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాం. రోడ్డు నిర్మాణంలో లోపం ఉంటే కాంట్రాక్టు సంస్థ బాధ్యత వహించాల్సి ఉంటుంది. 10 సంవత్సరాలు ఆ రోడ్డు పర్యవేక్షణ బాధ్యత వారిదే. ఎప్పుడైనా మరమ్మతులు చేయాల్సి వస్తే వారే చేస్తారు.

- రమణయ్య, పంచాయతీరాజ్ డీఈఈ, కోట సెక్షన్

సమావేశానికి అధికారులు వచ్చేలా చూడాలి

వెంకటగిరి రూరల్ : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. వార్డుల్లో రెవెన్యూ, హౌసింగ్‌కు సంబంధించిన సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారిని కలిసి వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారని వెల్లడించారు. ఈ క్రమంలో కౌన్సిల్ సమావేశాలకు ఆయా శాఖల అధికారులు హాజరై సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు వివరించేలా చూడాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న లీలమ్మ

చిట్టమూరు : గ్రామీణ ప్రాంతాల రైతులు పురుగు మందులు, రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఏ లీలమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై పంచాయతీల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు అనంతరావు, బాబాసాహెబ్, మండల యూనిట్ ఇన్‌చార్జి ధనమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నాయుడుపేట టౌన్ : ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకులం, పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ, శ్రీ వేమ జూనియర్ కాలేజీల్లో పరీక్ష సెంటర్లు ఏర్పాటుచేశారు. 1,150 మంది విద్యార్థులు తెలుగు, సంస్కృత పరీక్షలు రాశారు. చీఫ్‌లతో పాటు డిపార్ట్‌మెంట్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

వాటర్ ట్యాంకులకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం : మండలంలోని కల్లూరుకండ్రిగ, నెల్లూరుపల్లిలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులకు సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి మరమ్మతులు చేయించారు. శిథిలావస్థలో వాటర్ ట్యాంక్‌లు అన్న శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి స్పందించారు. కల్లూరుకండ్రిగలోని వాటర్ ట్యాంకు కింద ఉన్న తీగ చెట్ల ను తొలిగించారు. పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించారు. అలాగే నెల్లూరుపల్లిలో శిథిలావస్థకు చేరిన ట్యాంకుకు మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. సర్పంచ్ ఢిల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు కింద అల్లుకున్న తీగచెట్లను తొలగిస్తున్న కూలీలు

రీసర్వే తప్పుల దిద్దుబాటు



పొలాలను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్, ఆర్డీవో పావని

కలువాయి: మాదన్నగారిపల్లి పంచాయతీలో చేపట్టిన రీ సర్వేలో తప్పులు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో వాటిని వారంలోగా సరిచేస్తామని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మాదన్నగారిపల్లి సచివాలయంలో సోమవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం జేసీ రైతుల పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత సర్వేలో గ్రామానికి చెందిన అసైన్‌మెంట్, పట్టా భూములను ప్రభుత్వ భూములుగా చూపార ని తెలిపారు. 217 ఎకరాల డీఫారం పట్టాలను ప్రభుత్వ భూములుగా నమోదు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. వారంలోగా వీటిని అడంగల్ కరెక్షన్ చేసి రీస్టోర్ చేస్తామన్నారు. గ్రామంలో భూమి పట్టాల కోసం 100 మంది వినతులు ఇచ్చా రని తెలిపారు. వారి అర్హతలను పరిశీలించి అసైన్‌మెంట్ కమిటీకి సిఫార్సు చేస్తామన్నారు. కలువా యి మండలంలో బియ్యం అక్రమ రవాణాపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజు, డీటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమీర్‌షావలీ దర్గా ఉరుసు నిర్వహణకు చర్యలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణ నడిబొడ్డున ఉన్న హాజరత్ అమీర్‌షావలీ దర్గా ఉరుసు నిర్వహించేందుకు ఇరు కమిటీల వారు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో పట్టణానికి చెందిన దోర్నాదుల చెంచుకృష్ణయ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా మార్చిలో మూడు రోజులు ఉరుసు నిర్వహించేవారు. 2016లో దర్గా ఆస్తులు వక్ఫ్‌బోర్డుకు చెందినవని పేర్కొంటూ ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌షావలీ దర్గాతో పాటు అమీర్‌షావలీ మసీదుకు మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పాత కమిటీ, వక్ఫ్‌బోర్డు మేనేజ్‌మెంట్ కమిటీ మధ్య వివాదం మొదలైంది. ఇరువర్గాల వారు కోర్టును ఆశ్రయించడంతో 2017 నుంచి ఉరుసు జరగలేదు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో చర్చలు జరిగినా ఫలితం లేదు. ఈ క్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రెండు రోజుల క్రితం ఇరువర్గాల వారిని సమావేశ పరిచి సయోధ్య కుదిర్చారు. అమీర్‌షావలీ ఉరుసు వేడుకలను ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఉరుసు నిర్వహణకు నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో పాత, కొత్త కమిటీలకు చెందిన 10 మంది సభ్యులు, గౌరవ అధ్యక్షులు, అధ్యక్షులను నియమించారు. వారం రోజుల్లో ఇరువర్గాలకు చెందిన పెద్దలు, నాయకులు కలిసి ఉరుసు నిర్వహణ తేదీలు ప్రకటించనున్నారు.

ఆడబిడ్డలను చదివించుకుందాం

రాపూరు : ఆడబిడ్డలను బాగా చదివించుకుందామని అంగన్‌వాడీ సూపర్ వైజర్ రాధిక పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాపూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల చదువుపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. 18 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి చేయాలని సూచించారు.



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు, చిన్నారులు

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



ర్యాలీ చేస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

రాపూరు: వన్య ప్రాణులను రక్షించాల్సిన బాధ్య త అందరిపైనా ఉందని రాపూరు అటవీశాఖ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం మద్దెలమడుగులోని అటవీ శాఖ కార్యాలయం నుంచి రాపూరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వేసవిలో జంతువులు నీటి కోసం అడవుల నుంచి సమీపంలోని చెరువులు, బావుల వద్దకు వస్తుంటాయని, వాటికి హాని కలిగించవద్దన్నారు.

ఇంకుడు గుంతల పరిశీలన

చిల్లకూరు : భూగర్భ జలాలు పెంపొందించేందుకే కేంద్ర ప్రభుత్వం ఇంకుడు గుంతలు తవ్విస్తోందని ఉపాధి ఏపీవో గిరిబాబు తెలిపారు. ఆయన సోమవారం గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేపట్టిన ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఇంటి వద్దా ఇంకుడు గుంత తవ్వుకునేలా చూస్తున్నామని తెలిపారు. పూర్తిగా ఉచితంగా గుంతలు తవ్విస్తున్నట్టు వివరించారు. ఇంకుడు గుంతల ద్వారా ఇంటిలోని వ్యర్థ జలాలు నేరుగా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలని వినతి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని వత్రపాళెంలో అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. వారు సోమవా రం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫల మైందన్నారు. సచివాలయాల్లో ఎన్నిసార్లు అర్జీలిచ్చినా సర్వర్లు పనిచేయడం లేదని చెబుతున్నారని, ఇంకా ఎంతకాలం జరగాలని కమిషనర్‌ను ప్రశ్నించారు.

వాహనాల తనిఖీ



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

దక్కిలి: మండలంలోని వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని కందలవారపల్లి వద్ద సోమ వా రం ఎస్ఐ శివశంకర్ వాహనాలను తనిఖీ చేశా రు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

గొట్టిప్రోలు టీచర్‌కు బెస్ట్ అవార్డు



నాయుడుపేట టౌన్ : మండలంలోని గొట్టిప్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు సి.లక్ష్మీ బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఈవో డాక్టర్ రాజా బాలాజీరావు అవార్డు అందజేశారు. అనంతరం లక్ష్మీ, డాక్టర్ రామసుబ్బయ్య దంపతులను సత్కరించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

దక్కిలి : విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని, బాలికలు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో దక్కిలి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో పోలీసులు అందించే సేవలపై అవగాహన కల్పించారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

వెంకటగిరి (సైదాపురం) : ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదివాసి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకర్‌రావు కోరారు. పట్టణంలోని తెలుగంగ అతిథి గృహంలో సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని సూచించారు. ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటుచేసి రుణాలు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కడివేడు భూముల సర్వే ప్రారంభం



కడివేడు భూములను సర్వే చేస్తున్న సర్వే బృందాలు

చిల్లకూరు : ఎన్నో ఏళ్లగా పెండింగ్ పడుతూ వస్తున్న కడివేడు భూముల సర్వే ఎట్టకేలకు సోమవారం ప్రారంభమైంది. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు సంయుక్తంగా సర్వే చేపట్టారు. కడివేడు రెవెన్యూ పరిధిలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిని కొంతమంది ఆక్రమించుకుని రికార్డుల్లోకి ఎక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొంతమందికి అనేక ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చారు. ఒకరు సాగులో ఉండగా మరొకరి పేరుతో పట్టాలు ఉన్నాయి. ఈ క్రమంలో తగాదాలు జరుగుతున్నాయి. భూములను సర్వే చేసి హద్దులు చూపించాలని గ్రామస్తులు కోరుతూ ఉన్నారు. ఇది రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారడంతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కడివేడు భూములను సర్వే చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వేపై రెండు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం పది ప్రత్యేక బృందాల ద్వారా సర్వే చేస్తున్నామని వివరించారు. ముందుగా కడివేడు గ్రామ హద్దులు డ్రోన్ ద్వారా సర్వే చేస్తామని, తర్వాత ప్రత్యేక బృందాలు సర్వే చేస్తాయన్నారు.

పరిహారం ఇవ్వాలని వినతి

చిల్లకూరు : క్రిస్ సిటీకి భూములు ఇచ్చిన వారిలో లింగవరం గ్రామంలోని రెండు కాలనీలకు చెందిన గిరిజనులు కూడా ఉన్నారని, వారికి కూడా పరిహారం అందజేయాలని నాయకులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ లింగవరం పంచాయతీలోని కొంత మందికి మాత్రమే పరిహారం అందించేలా చూస్తున్నారని వాపోయారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చామన్నారు. అయినా జాబితాలో అర్హులందరి పేర్లు లేవని పేర్కొన్నారు. మరొకసారి పరిశీలించి అందరికీ పరిహారం అందజేయాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ పరిహారం అందించే ముందు గ్రామంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యంతరాలు, వినతులు అందించాలని సూచించారు.

బంగారు నగల చోరీపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని ఒక బ్యాంకులో తాకట్టు పెట్టిన 5 సవర్ల బంగారు నగలు విడిపించుకుని వస్తుండగా చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని పండ్లూరు వెంగమాంబపురానికి చెందిన అత్తికాయల సుధాకర్ నాయుడుపేటలోని ఇండియన్ బ్యాంకులో 5 సవర్ల బంగారు నగలు తాకట్టు పెట్టాడు. గత నెల 25న వాటిని విడిపించుకున్నాడు. బ్యాంకు సమీపంలో ఉన్న కారు వద్దకు వచ్చే సరికే అతని జేబులో ఉన్న బంగారు నగలు కనిపించకుండాపోయాయి. చుట్టు పక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబి తెలిపారు.

డాక్టర్ రమణయ్య మృతికి సంతాపం



డాక్టర్ కేవీ రమణయ్య (ఫైల్)



డాక్టర్ రమణయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి

నాయుడుపేట టౌన్ : ప్రముఖ వైద్యులు, విశ్రాంత డీఎంఅండ్ హెచ్‌వో కేవీ రమణయ్య మృతి పేదలకు తీరని లోటని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం రమణయ్య మృతికి సంతాపం తెలిపారు. నాయుడుపేట మండలంలోని బిరదవాడకు చెందిన డాక్టర్ కేవీ రమణయ్య(75) అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన భౌతికదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుడిగా నెల్లూరులో పనిచేశారు. తర్వాత డీఎంఅండ్‌హెచ్‌వోగా పనిచేశారు. స్థానిక వైద్యులు శ్రీధర్ రెడ్డి, గోపీనాథ్, రోటరి క్లబ్ సభ్యులు హెచ్ సుబ్రహ్మణ్యం, పీడీ ఉదయశంకర్, చిగురువాడ పద్మనాభం తదితరులు సంతాపం తెలిపారు.